క్లుప్తంగా

నేడు ఐటీఐ అడ్మిషన్ కౌన్సిలింగ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్(ఐటీఐ)హైదరాబాద్‌లో ఉన్న ఖాళీ సీట్ల భర్తీ కోసం అడ్మిషన్ కౌన్సిలింగ్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఐటీఐ భవనం లో కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తామన్నారు. అందుకోసం అర్హులైన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వ్యక్తిగతంగా కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ 040-23008428, సెల్ నెంబర్ 9440692452లో సంప్రదించాలని కోరారు.

23 నుంచి జ్ఞానయజ్ఞ మహోత్సవం

మోతీనగర్: మోతీనగర్‌లోని శృంగేరి శారదా శంకరమఠం ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మశ్రీ తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు సప్తాహ మహాత్య కార్యక్రమం ఉంటుందన్నారు.

అంతర్జాతీయ శాంతి ధృవ స్థాపన దినోత్సవం

హఫీజ్‌పేట్: నానక్‌రామ్‌గూడలోని ది శ్రీరామ్ యూనివర్సల్ పాఠశాలలో గురువారం అంతర్జాతీయ శాంతి ధృవ స్థాపన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త, ఆర్‌సీజేహెచ్ మాజీ అధ్యక్షురాలు రోటేరియన్ ఝాన్సీ ప్రేమానంద్, అసిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ సురేష్ గుప్తా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, రోటేరియన్ డాక్టర్ జ్యోతి రెడ్డి, కార్యదర్శి వజ్రల రాజ గోపాల్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మోతీనగర్: అల్లాపూర్ ప్రధాన రోడ్డు పెట్రోల్ బంకు సమీపంలో అక్రమంగా నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని గురువారం జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ పట్టణ ప్రణాళిక అధికారుల పర్యవేక్షణలో కూల్చివేశారు. బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆకస్మికంగా పర్యటించినప్పుడు ఆయన అక్రమ నిర్మాణాలు పరిశీలించారు. వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో రెండు రోజుల నుంచి డివిజన్‌లో ఎక్కడెక్కడ అక్రమ నిర్మాణాలు, నాలాల పక్కన ప్రమాదకరంగా ఉన్న నిర్మాణాలను కూల్చివేయటానికి శ్రీకారం చుట్టారు.

ఎంటెక్, యూజీ-సీయూఈటీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నాలుగేళ్ళ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కోసం సీయూఈటీలో అర్హత సాధించిన అర్హతగల అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ గురువారం తెలిపారు. ముఖ్యంగా బీఏ, బీఏ(జేఎంసీ) బీకామ్, బీఎస్సీ కోర్సులతోపాటు ఎంటెక్, సీఎస్ఈ(ఏఐ, ఎంఎల్) వంటి కోర్సులకు ఈ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. అంతే కాకుండా యూనివర్సిటీలో స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్స్ మోడ్‌లో పార్ట్‌టైమ్ ప్రోగ్రామ్‌ల కోసం ఆన్‌లైన్ పోర్టల్ ఈనెల 23, 24 తేదీలలో ఓపన్ అవుతుందన్నారు. ఇప్పటికే 'మనూ'ను ఎంపిక చేసుకున్న అభ్యర్థులు, ఎంచుకోవడంలో విఫలమైన, అర్హత సాధించని, సీయూఈటీలో ఉర్దూను లాంగ్వేజ్ ఆప్షన్‌గా ఎంచుకోని అభ్యర్థులు ఉర్దూగా చదివి ఉంటే కూడా యూజీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

ముగిసిన విజ్ఞానోత్సవ్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ స్టడీస్ (సీఐఎస్)తో అనుబంధంగా ఉన్న జూనియర్ సైన్స్ క్లబ్ (జేఎస్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక సైన్‌ఫెస్ట్-విజ్ఞానోత్సవ్-2023 ముగిసింది. కార్యక్రమానికి ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ గ్రాంట్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ నిధులను సమకూర్చాయి. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ స్టడీస్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, సీఐఎస్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌సుబోధ్, జేఎస్సీ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కె మురళీధరన్,ఐఈఓ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం ఘనశ్యామ్‌కృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు.

పునరుత్పాదక ఇంధన వనరుల పెరుగుదలలో ప్రగతి

రాయదుర్గం: ఇంధన మిశ్రమంలో పునరుత్పాదక ఇంధన వనరుల పెరుగుదలలో ఎంతో ప్రగతి కనిపిస్తోందని పీజీసీఐఎల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా లో పీజీసీఐఎల్ ఎగ్జిక్యూటివ్‌ల కోసం 'రెన్యూవబుల్ ఎనర్జీ జనరేషన్-గ్రిడ్ ఇంటిగ్రేషన్ అంశాలు-బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌పై అనుకూలీకరణ' అంశంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావుతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

ఆనందం 'డబుల్' అయిన వేళ..

ప్రతిపక్షాల నిరసన జ్వాల

ఒక వైపు ఇళ్లొచ్చాయనే ఆనందం.. మరోవైపు ఇళ్లు రాలేదనే దుఖం

దుండిగల్: ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల విధానాన్ని అవలింభించారు. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఎంపిక లక్కీడ్రా లో ఇల్లు రాని నిరుపేదలు ప్లకార్డులు చేతబూని నిరసన తెలుపడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం పగడ్బందీగా పక్కా ప్రణాళికతో రూపొందించారు. మూడంచెల భద్రత బలగాన్ని ఏర్పాటు చేసి అనుమానం ఉన్న వారిని ఔటర్ రింగ్ సర్వీస్ రోడ్డు పక్కనే నిలిపి మిగతా వారిని లోపలికి పంపించారు.

ఉదయమే ప్రతిపక్ష నేతల అరెస్టు..

గురువారం ఉదయమే కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాల నేతలను ముందస్తుగా అదుపులోకి తీసుకుని దుండిగల్, బాచుపల్లి, జగద్గిరిగుట్ట, జీడిమెట్ల పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన లబ్ధిదారులకు వేర్వేరుగా అయా అసెంబ్లీ వారీగా కూర్చోబెట్టారు. సుమారు 1800 మంది లబ్ధిదారులు హాజరుకాగా మరో 500 మందికి పైగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు హడావిడి చేశారు. మధ్యాహ్నం 12గంటలకు మంత్రి కేటీఆర్ వస్తారని ప్రచారం చేసినప్పటికీ గంట ఆలస్యంగా వచ్చారు. ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడిన తర్వాత మంత్రి కేటీఆర్ ప్రసంగం పూర్తి చేసి సమావేశాన్ని ముగించడం విశేషం. ఒక వైపు ఇళ్లొచ్చాయనే ఆనందంలో లబ్ధిదారులు ఉంటే మరోవైపు ఇళ్లు రాలేదని దుఖంలో పేదలు కనిపించారు.

అరెస్టులు.. గృహ నిర్బంధాలు

సుభాష్‌నగర్: దుండిగల్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి మంత్రి కేటీఆర్ వస్తున్న నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నుంచే బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డిని గాజులరామారం చిత్తారమ్మనగర్‌లోని ఆయన నివాసంలో గృహ నిర్బంధం చేశారు. అదే విధంగా సుభాష్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు, ఉపాధ్యక్షుడు విఘ్నేశ్ ముదిరాజ్‌లను సూరారం పోలీసుస్టేషన్ తరలించారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి వస్తే తమను అరెస్ట్ చేయడం ఏమిటని, తాము ఇంకా రజాకార్ల పాలనలో ఉన్నామా అని ప్రశ్నించారు. ఇలాంటి అరెస్టులతో భయపడేది లేదన్నారు. అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు.

ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్మిస్తున్న 15వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను 50శాతం స్థానికులకే కేటాయించాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో గురువారం గండిమైసమ్మ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా విడుదల చేసిన నిధులతో డబుల్ బెడ్‌రూమ్‌లను నిర్మించి బీఆర్‌ఎస్ ప్రభుత్వ తామే కట్టినట్టుగా ప్రచారం చేస్తుందన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఇళ్లను కేటాయిస్తూ స్థానికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రతి లబ్ధిదారుడికి ఇళ్లు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

◆ 600మందిని మోసం చేశారు..

2011లో దుండిగల్ మున్సిపాలిటీలో 600 మందికి అప్పటి ప్రభుత్వం సర్వే నం 453/454 లో ఇచ్చిన 60 గజాల స్థలాలను ఇప్పుడు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు వాడుకొని ఆ 600 మందిని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్యామ్ రావు, విఘ్నేశ్వర్, గోనె మల్లారెడ్డి, రామచంద్ర రెడ్డి, ఆకుల మల్లేష్, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆకుల విజయ్, వెంకటేష్ నాయక్, జంగారెడ్డి, ఆకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



గండిమైసమ్మ చౌరస్తాలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

ఫోన్లకు అలర్ట్ సౌండ్.. ఉలిక్కిపడ్డ జనం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. ఒకవైపు మంత్రి కేటీఆర్ మాట్లాడుతుండగా సడన్‌గా ఫైర్ ఇంజన్ సౌండ్ రావడం.. ఇంతలోనే అక్కడ ఉన్న వేలాది మంది ఫోన్లకు మెసేజ్‌లు రావడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. మొదట మంత్రి వచ్చాడు. స్థానికంగా సిగ్నల్స్ లేకుండా జామర్లు పెట్టారు అని భావించిన అందరికీ.. ఫోన్‌లో వచ్చిన మెసేజ్‌లు చూసుకొని కూల్ అయ్యారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ భారత ప్రభుత్వం ద్వారా ఈ సందేశం పంపబడుతుందని సమాచారం చదువుకున్న అందరూ రిలాక్స్ అయ్యారు. ఇలా కొంతసేపు ఒకరినొకరు ఫోన్లు చూసుకుంటూ మీకు వచ్చిందా అంటూ.. మీకు వచ్చిందా..! అని సమావేశంలో చర్చించుకోవడం కనిపించింది.

లబ్ధిదారుతో కేటీఆర్ సరదా సంభాషణ

దుండిగల్: చాయ్ అమ్ముకుని.. దేశాన్ని మోసం చేయొద్దు అంటూ ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రధాని మోదీపై మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దుండిగల్‌లో ఐడీపీఎల్ ప్రాంతానికి చెందిన వాహిద్ ఉన్నీసా అనే మహిళలకు మొదటి పట్టాను మంత్రి కేటీఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమెతో ఆయన సరదాగా సంభాషించారు. తనకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడని.. సొంత ఇళ్లు లేదని.. ఐడీపీఎల్ చౌరస్తాలో చాయ్ అమ్ముకుంటూ జీవిస్తున్నానని చెప్పుకొచ్చింది. వెంటనే మంత్రి కేటీఆర్ చాయ్ అమ్ముకోవాలే తప్ప దేశాన్ని మోసం చేయొద్దంటూ పరోక్షంగా సెటైర్ వేయడంతో అక్కడున్న వారంతా నవ్వుకున్నారు.



కొంపల్లి - బహదూర్‌పల్లి రోడ్డు జామ్

సుభాష్‌నగర్: దుండిగల్ లో గురువారం డబల్ బెడ్ రూమ్ పంపిణీలో భాగంగా మంత్రి కేటీఆర్ వస్తున్న నేపథ్యంలో కొంపల్లి- బహదూర్‌పల్లి మధ్య ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే డబల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు దుండిగల్ రావడానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. ఉదయం పదుల సంఖ్యలలో ఆర్టీసీ బస్సులు రావడం.. అదే సమయంలో స్థానికంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాల బస్సులు రావడంతో మైసమ్మగూడ చౌరస్తా వద్ద జామ్ ఏర్పడింది. దీంతో అటు బహదూర్‌పల్లి వరకు.. అక్కడ నుంచి దూలపల్లి వరకు రెండు గంటల పాటు ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. దీంతో గుండ్లపోచంపల్లి మీదుగా, జీడిమెట్ల పారిశ్రామికవాడ మీదుగా వాహనాలను దారి మళ్లించారు.

ఏర్పాట్ల పర్యవేక్షణలో అధికారులు నిమగ్నం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, జెడ్‌సీ మమత

కుత్బుల్లాపూర్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ ఏర్పాట్ల పర్యవేక్షణ విషయంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత ముందస్తు ఏర్పాట్లు చేశారు. మంత్రి కేటీఆర్ రాక సందర్భంగా అధికారులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ లబ్ధిదారుల జాబితా విషయంపై ర్యాండమైజేషన్ పద్ధతిలో ప్రతి ఒక్కరికి అర్థమయ్యే విధంగా వివరించారు. పారదర్శకంగా జాబితా రూపొందించినట్లు, ప్రతి ఒక్కరి అనుమానాలను నివృత్తి చేసే విధంగా కళ్లముందే 1800 ఇళ్ల లబ్ధిదారులకు అంతస్తుల వారీగా ఇళ్లు కేటాయించడం విశేషం. వికలాంగులకు గ్రౌండ్, మొదటి అంతస్తులో ఇతరులకు వివిధ కేటగిరీల వారీగా వివిధ అంతస్తుల్లో ప్లాట్ల నంబర్లు కేటాయించారు.

ఒకే వేదికపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



కుత్బుల్లాపూర్: ఒకే వేదికపై చాలా రోజుల తర్వాత ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు, స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్ ఆసీనులు కావడం కార్యకర్తల్లో జోష్ నింపింది. ఈనెల 2వ తేదీన బహదూర్‌పల్లిలో జరిగిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరైనప్పటికీ ఎమ్మెల్సీ రాజు హాజరు కాకపోవడంతో మెజార్టీ ప్రజాప్రతినిధులు ఆ సమావేశానికి డుమ్మా కొట్టారు. తాజాగా ఈనెల 21న గురువారం జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఒకే వేదికపై రావడం.. ఇద్దరినీ రామలక్ష్మణులుగా మంత్రి కేటీఆర్ అభివర్ణించడం.. సమష్టిగా ఇద్దరు సమానమే అన్నట్లుగా మాట్లాడి కార్యకర్తల్లో జోష్ నింపారు. ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ స్టేజీ మొత్తం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో నిండిపోగా ప్రభుత్వ అధికారులు మాత్రం కుర్చీలు లేక నిలబడిపోయారు. ఒకానొక సందర్భంలో మహిళా ప్రజాప్రతినిధులు ఒకరిపై ఒకరు కూర్చోవడం విశేషం.

సందడిగా తెలంగాణ సాంస్కృతిక విభావరి

నిజాంపేట్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిజాంపేటలోని స్ప్రింగ్ విల్లా కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గురువారం తెలంగాణ సాంస్కృతిక విభావరి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. డోలక్ శివ బృందం నేతృత్వంలో సాగిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ గీతాలు, భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణలు హాజరయ్యారు. ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పురస్కారాన్ని అందుకున్న గోరేటి వెంకన్నకు కోకా ఇన్నా అధినేత కోకా మధు బాబు గండపెండేరు తొడిగి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్, బాలకృష్ణ, సుదర్శన్ రెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ నాయకులు మధు బాబు, వీరస్వామి, గిడుగు రవి కుమార్, ఆంజనేయ రెడ్డి, సుదీర్, స్ప్రింగ్ విల్లా వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ప్రవీణ్, వెంకటేష్, వెంకటేశ్వరరావు, శివ, జక్కుల శ్రీనివాస్, సత్య, సురేందర్‌లు పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరేటి వెంకన్న

ప్రభుత్వ పథకాలను ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలను ఆకర్షితులైపలువురు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ లెనిన్ నగర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పిన సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని అన్నారు. నేడు దేశానికి కేసీఆర్ మార్గదర్శకులుగా మారారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, నాయకులు కస్తూరి బాలరాజ్, కమలాకర్, సాంబా రాజు, తారాసింగ్, బస్వరాజు, తెలంగాణ సాయి, చిన్న చౌదరి, ప్రవీణ్, లక్ష్మి తదితరులు ఉన్నారు.



నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ లైన్ల రీకండక్టరింగ్ పనుల, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ జీబీఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పీఎస్‌ఆర్ కన్వెన్షన్, రిలయన్స్ పెట్రోల్ బంక్, సయ్యద్‌నగర్, టొబాకో కంపెనీ, ప్యారడైజ్ రోడ్డు, జీబీఆర్ కల్చర్ క్లబ్ ప్రాంతాల్లో, అదే విధంగా 11 కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కుమ్మరి బస్తీ, ఆంధ్రబస్తీ, మున్సిపల్ కార్యాలయం, సెంట్రల్ పార్క్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ పేర్కొన్నారు.

◆ విద్యుత్ ఫీడర్ల నిర్వహణ శుక్రవారం పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గాయత్రినగర్, గోదావరి హోమ్స్, బృందావన్ కాలనీ, టీఎస్‌ఆర్ గార్డెన్, అదే విధంగా 11 కేవీ జీడిమెట్ల గ్రామం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జీడిమెట్ల గ్రామం, గ్రీన్ పార్క్, పిస్తా హౌజ్, ప్రధాన రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ నిజాంపేట్, ఎస్ఎల్‌జీ, మావిల్లాస్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శిఖర విల్లాస్, బాచుపల్లి పోలీస్‌స్టేషన్, బాచుపల్లి సిగ్నల్స్ నుంచి శిఖర విల్లాస్ వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

మతిస్థిమితం సరగాలేని మహిళ అదృశ్యం



మాధవిలత (ఫైల్)

కుత్బుల్లాపూర్: మతిస్థిమితం సరగాలేని ఓ మహిళ అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంక్ కాలనీకి చెందిన మాధవిలతకు ఈనెల 20వ తేదీన మధ్యాహ్నం 2.50గంటల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం వరకు ఆమె రాక కోసం ఎదురు చూసిన కుటుంబ సభ్యులు ఆందోళనతో చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకుండాపోయింది. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని, వెతికి పెట్టాలని కోరుతూ గురువారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గణపతి మండపం వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుడికి పూజలు

కుత్బుల్లాపూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు కుత్బుల్లాపూర్‌లో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. నాల్గో రోజు గురువారం ఆయా మండపాల వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయడంతో భక్తి గీతాలు ఆలపించారు. గణనాథులకు నైవేద్యాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.





నిమజ్జనం చేయకుండా విగ్రహాలను తరలిస్తారా?

సుభాష్‌నగర్: మూడు రోజుల నుంచి ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి భక్తులు నిమజ్జనానికి తీసుకొస్తే కనీసం నీళ్లలో తడపకుండా గణేశ్ విగ్రహాలను జీహెచ్‌ఎంసీ అధికారులు తరలిస్తున్నారని బీజేపీ జిల్లా నాయకుడు వారాల మహేష్. రవిలు మండిపడ్డారు. సూరారంలోని కట్టమైసమ్మ చెరువులో వేయకుండానే లారీల్లో తరలిస్తున్నారని సమాచారం అందడంతో గురువారం రాత్రి బీజేపీ నాయకులు అక్కడ చేరుకొని అట్టి వాహనాన్ని అడ్డుకున్నారు. ఓవైపు నిమజ్జనం కోసం చెరువుల వద్ద లక్షలు ఖర్చు పెడుతున్నామని చెప్పే అధికారులు విగ్రహాలను కనీసం తడపకుండా వాహనాలు తరలించడం ఏమిటని అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు ఓవైపు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మరోవైపు బీజేపీ నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నిమజ్జనం పేరిట లక్షలు వెచ్చిస్తున్నామని చెప్పి మరోవైపు తూతూ మంత్రంగా పనిచేసే అధికారులపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని మహేష్ డిమాండ్ చేశారు.





విగ్రహాలను నిమజ్జనం చేయకుండానే లారీలో తరలిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు వారాల మహేష్, రవి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029